నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 27 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI

నల్లగొండ క్లాక్ టవర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రేపు బీఆర్ఎస్ రైతు మహాధర్నా

- హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- క్లాక్ టవర్ సెంటర్‌లో ధర్నాకు ఏర్పాట్లు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సన్నాహకాలు
- భారీగా తరలొచ్చేందుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- మహాధర్నాకు విస్తృత ప్రచారం

నల్లగొండ ప్రతినిధి, జనవరి26(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న రైతు మోసాలపై నల్లగొండ వేదికగా జంగ్‌సైరన్‌కు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. అసంపూర్తి రుణమాఫీ, కోతల రైతు భరోసాలతోపాటు బోనస్ ఎగవేత తదితర అంశాలపై రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు క్లాక్‌టవర్ వేదికగా మహాధర్నాకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రైతు మహాధర్నాకు అడుగడుగునా ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా ఆటంకాలు సృష్టిస్తున్నా బీఆర్ఎస్ హైకోర్టు తలుపు తట్టి అనుమతులు సాధించింది. హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహాధర్నాకు సిద్ధమైంది. ఈ ధర్నాకు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్న రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చే సంకేతాలు ఉండడంతో అందుకు అనుగుణంగా బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలంతా మహాధర్నాపై దృష్టి సారించారు. ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పార్టీ నేతలతో కలిపి క్లాక్ టవర్ సెంటర్‌లో ధర్నా ఏర్పాట్లను సమీక్షించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచే తొలి సీఎం కేసీఆర్.. వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ దేశంలోగా రాష్ట్ర రైతన్నలను సగర్వంగా తలెత్తుకునేలా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. ఎవ్వరూ ఊహించని విధంగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు, సాగునీరు, పెట్టుబడి సాయంగా రైతుబంధు, రైతు బీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలు, పంటల కొనుగోళ్లు, వెనువెంటనే చెల్లింపులు ఇలా సాగుమడిలో రైతన్నను కేసీఆర్ నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహించారు. దీంతో దేశంలో రాష్ట్రం, రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయంలోనే అనతికాలంలోనే అగ్రభాగాన నిలిచింది. దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన జిల్లాగా నల్లగొండ చరిత్రకెక్కింది. ఏ ఊరు చూసినా పచ్చని పొలాలతో కళకళలాడింది. రైతుల మోకాల్లో వెలుగులు నిండాయి. కేసీఆర్ పాలనలో ఉమ్మడి జిల్లాలో 13లక్షల ఎకరాల నుంచి 23 లక్షల ఎకరాలకు సాగుభూమి విస్తరించింది. దీంతో ఒక్కో సీజన్‌లో 40లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం ఉత్పత్తి జరిగింది. ఇలా రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగంలో అత్యధిక లబ్ధి పొంది న జిల్లాగా నల్లగొండ అవతరించింది. కానీ ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం అనసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం తిరిగి కుదేలయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. రుణమాఫీ అమలులో, రైతుభరోసా డబ్బుల్లోనూ ప్రభుత్వ విధానాలతో రైతన్నకు మొండిచెయ్యి చూపుతున్నది. రెండు లక్షల రూపాయల రుణమాఫీ కోసం నేటికీ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మందికి పైగా రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇక రైతుభరోసా ద్వారా ఉమ్మడి జిల్లాలో 25 లక్షల మంది రైతులకు ఒక్క సీజన్‌లోనే ఎకరాకు రూ.7500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తే సుమారు రూ.1950 కోట్ల లబ్ధి రైతులకు జరుగాల్సి ఉంది. కానీ దాన్ని ఆరు వేలకు కుదించడం వల్ల ఆ లబ్ధి రూ.1,300 కోట్లు కూడా దాటేలా లేదు. గత యాసంగిలో ఎకరం మీద రూ.2,500 కోత, వానకాలంలో మొత్తంగా రూ.7,500కు ఎసరు, ప్రస్తుత సీజన్‌లో సైతం ఎకరాకు రూ.1500 కోత పెట్టడం వల్ల మొత్తంగా 11,500 ఒక్కో ఎకరంపైన రైతు పెట్టుబడి సాయాన్ని కోల్పోతున్నాడు. మొత్తంగా చూస్తే సుమారు 3వేల కోట్ల రూ పాయల రైతు భరోసాకు కాంగ్రెస్ సర్కార్ ఎసరు పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. స్వచ్ఛందంగా అనేక ప్రాంతాల్లో రైతులు వివిధ సందర్భాల్లో రోడ్లెక్కారు. పంటల కొనుగోళ్లపై, బోనస్ డబ్బుల ఎగవేతపై, రైతుభరోసా ఎగనామంపై, పలుమార్లు కరెంటు కోతలపై, ఎరువుల కొరతలపై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నాలు చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వ తోడ్పాటు కొరవడడంతో రైతులు సాగుమడిలో చతికిలపడుతూ ఆత్మస్థైర్యం కోల్పోతున్న సందర్భాలు నెలకొంటున్నాయి. దీంతో కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 30 మంది వరకు రైతులు ఏడాది కాలంలో తనువు చాలించినట్లు రైతు సంఘాల అంచనా. ఇట్లాంటి తిరోగమన పరిస్థితుల్లో రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగుతున్నారు.

చకచకా ఏర్పాట్లు

రైతుభరోసా మోసంపై నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్ వేదికగా తలపెట్టిన రైతుమహాధర్నాలో కేటీఆర్ పాల్గొననున్నారు. నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు రైతు మహాధర్నాకు పార్టీ నేతలు చకచకా సాగుతున్నాయి. మహాధర్నాకు విస్తృత ప్రచారం కల్పించేలా నల్లగొండలో ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటుపై దృష్టి సారించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి... ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్లు, ఇతర ముఖ్య నేతలందరినీ ఎప్పటికప్పుడూ సమన్వయం చేస్తున్నారు. ఈ నెల 24వ తేదీన నల్లగొండ పార్టీ కార్యాలయంలో ముఖ్యులందరితో సమావేశమై మహాధర్నాపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో ఉన్న రైతులే స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు కావాల్సిన సహకారం పార్టీ నేతలు అందించాలని సూచించారు. రైతులు కూడా పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ధర్నాస్థలంలో ఏర్పాట్లు చేయాలని జగదీశ్‌రెడ్డి స్థానిక నేతలకు సూచించారు. కాగా ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి క్లాక్‌టవర్ సెంటర్‌లో మహాధర్నా ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, సభాప్రాంగణం, పార్కింగ్, ఇతర సదుపాయాలపై పార్టీ నేతలో చర్చించారు. ధర్నాకు వచ్చే పార్టీ శ్రేణులకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి వివరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, పల్లె రంజిత్, రావుల శ్రీనివాస రెడ్డి, బొజ్జ వెంకన్న, లొడండి గోవర్ధన్, మెరుగు గోపి తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్' స్పెషల్ ఆఫీసర్‌గా అడిషనల్ కలెక్టర్ గంగాధర్

- ఆదివారంతో ముగిసిన మున్సిపల్ చైర్మన్ల పదవీ కాలం

యాదాద్రి భువనగిరి, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : మున్సిపాలిటీల్లో స్పెషల్ అధికారుల పాలన షురూ కానుంది. సోమవారం నుంచి ప్రత్యేక అధికారులు పాలన కొనసాగనుంది. ఆదివారంతో మున్సిపల్ చైర్మన్ల పదవీ కాలం ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలన తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. జిల్లాలో భువనగిరి, ఆలేరు, పోచంపల్లి, యాదగిరిగుట్ట, మోత్కూర్, చౌటుప్పల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా పురపాలక సంఘాలకు ప్రత్యేక అధికారిగా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) గంగాధర్‌ను సర్కార్ నియమించింది. ఈ మేరకు ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానికిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అడిషనల్ కలెక్టర్ గంగాధర్

అనర్హులకు ఎలా ఇస్తారు?

ఉన్నోళ్లకే రెండేసి పథకాలు ఇస్తున్నారంటూ ఆగ్రహం

పథకాల అమలుపై పలు చోట్ల గ్రామస్తుల ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నాలుగు పథకాల ప్రారంభ కార్యక్రమంలో పలు చోట్ల రగడ నెలకొంది. అర్హులకు పథకాలు దక్కలేదాంటూ నిరసనలు వ్యక్తమయ్యాయి. అనర్హులకు ఎలా పథకాలు కట్టబెట్టారాంటూ నిలదీశారు. ఉన్నోళ్లకే రెండేసి పథకాలు ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు మహిళలు కంట తడి పెట్టుకున్నారు.

– యాదాద్రి భువనగిరి, జనవరి 26 (నమస్తే తెలంగాణ)

కోతులాపురంలో అధికారులతో వాగ్వాదం.. నిరసన

నారాయణపురం స్పెషల్ ఆఫీసర్ కారు అడ్డగింత

తిమ్మాపూర్‌లో గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా

బురుజుబావిలో బోరున విలపించిన మహిళ

జిల్లాలో 17 గ్రామాల్లో నాలుగు పథకాల అమలుకు శ్రీకారం

రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆదివారం జిల్లాలోని 17గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు పథకాల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎంపిక చేసిన ప్రతి గ్రామంలోనూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టారు. వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామంలో ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు రావు హాజరయ్యారు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పథకాలకు శ్రీకారం చుట్టారు. రామన్నపేట మండలం ఉత్తటూర్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.

1144 ఇందిరమ్మ ఇండ్లు..

జిల్లాలో నాలుగు పథకాలకు సంబంధించి 17 గ్రామాల్లో లబ్ధిదారుల వివరాలను అధికారులు వెల్లడించారు. రైతు భరోసా కింద 8,961 మందికి లబ్ధి చేకూరింది. 17,644 మందికి రైతులకు సంబంధించి 44,905.19 ఎకరాలకు ఖాతాల్లో రూ. 26,95, 17,733 డబ్బులు జమ చేశారు. 910 రేషన్ కార్డులు, 1144 ఇందిరమ్మ ఇండ్లు, 324మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల మంజూరు ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. అయితే మిగతా గ్రామాల్లో ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

17 గ్రామాల్లో 4 పథకాలు ఇలా..

రైతు భరోసా	8,961
రేషన్ కార్డులు	910
ఇందిరమ్మ ఇళ్లు	1,144
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	324



ఆత్మకూరు(ఎం) : తిమ్మాపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జాబితాలో పేర్లు రాని గ్రామస్తులు

అర్హులకు దక్కలేదంటూ..

ఇటీవల వరుసగా నాలుగు రోజులపాటు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయగా.. గ్రామస్తుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. ఆదివారం సైతం పథకాల అమలు కార్యక్రమంలో కొన్నిచోట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించారని ఆయా చోట్ల గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. నారాయణ పురం మండలంలోని కోతులారంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉన్నోళ్లకే రెండేసి పథకాలు ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు రాలేదని ఆ మండలం స్పెషల్ ఆఫీసర్ జయశ్రీ ని కారును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ కంట తడిపెట్టి.. బోరున విలపించింది. ఆత్మకూరు (ఎం) మండలంలోని తిమ్మాపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అర్హులైన లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని.. ఎంపికైన లబ్ధిదారులలో కొంతమందికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేసి వెళ్లిపోయారు. అర్హత ఉండి కూడా జాబితాలో పేర్లు రాకపోవడంతో అర్హులైన వారందరికీ నాలుగు పథకాలను అందజేయాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక గుండాల మండలంలోని బురుజుబావి గ్రామంలో తన పేరు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జాబితాలో రాలేదని ఓ మహిళ బోరున విలపించింది. తనకు సొంత ఇల్లు లేక తాము కిరాయి ఇంట్లో ఉంటున్నానని, అన్యాయం జరిగిందని వాపోయింది.

తిమ్మాపురంలో గ్రామస్తుల ధర్నా

ఆత్మకూరు(ఎం) : మండలంలోని తిమ్మాపురంలో ప్రభుత్వం ఆదివారం ప్రారంభించిన 4 పథకాల్లో నిజమైన అర్హులకు మంజూరు కాలేదంటూ పలువురు గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కొంతమంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి వెళ్లిపోయారు. తర్వాత మండలస్థాయి అధికారులు అర్హులైన జాబితాను చదువుతుండగానే కొంతమంది పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీశారు. దీంతో మధ్యలోనే అధికారులు కూడా వెళ్లిపోయారు. దీంతో జాబితాలో పేర్లు లేని అర్హులైన ప్రజలు ధర్నా నిర్వహించారు. గ్రామంలో ఒకే ఇంట్లో 3 ఇండ్లు మంజూరు చేశారని ఆరోపించారు. తప్పుడు సర్వే నిర్వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని కోతులాపురంలో రభస

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని కోతులాపురంలో ఆదివారం అందించిన పథకాల్లో అర్హులకు ఇచ్చారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. లబ్ధిదారులను ఏ ప్రాతిపాదికన గుర్తించారో చెప్పాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వంగూరి నాగమ్మ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. 'నాకు గుంట భూమి లేదు సారు..కొడుకులు లేరు.. నాకు ఒక్కతే బిడ్డ.. కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నా.. ఆత్మీయ భరోసా పథకం పేపరు పెద్ద సార్లు నాకు ఇచ్చినారు..మరి ఇల్లు ఎందుకు ఇవ్వలేదు' అని కన్నీటి పర్యంతమైంది. తనకు ఇందిరమ్మ ఇల్లే కావాలని ఆత్మీయ భరోసా పథకం ప్రొసీడింగ్ కాపీని అధికారికి తిరిగి ఇచ్చేసింది.

సంస్థాన్ నారాయణపురం : కోతులపురం గ్రామంలో రేషన్ కార్డు, ఇల్లు రాలేదని స్పెషలాఫీసర్ జయశ్రీ కారును అడ్డుకున్న మహిళలు

బురుజుబావిలో అధికారులను నిలదీసిన తల్లీకొడుకు

గుండాల మండలం బురుజుబావి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని కన్నీటి పర్యంతమవుతున్న మహిళ

గుండాల : మండలంలోని బురుజుబావిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో తన పేరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో రాలేదని గ్రామానికి చెందిన తోటకూరి బొజ్జమ్మ కన్నీటి పర్యంతమయ్యింది. తన కుటుంబం కిరాయి ఇంట్లో ఉంటున్నదని, తనకు దివ్యాంగుడైన కుమారుడు ఉన్నాడని, తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని తీవ్ర మనోవేదనకు గురయ్యింది. తన కొడుకుతో కలిసి మండల ప్రత్యేక అధికారి విష్ణువర్ధన్ రెడ్డిని నిలదీసింది. దాంతో ఆయన వచ్చే విడుతలో ఇల్లు వస్తుందని చెప్పి గ్రామపంచాయతీ కార్యాలయంలోకి వెళ్లారు. ఆ ఆ తర్వాత ఆమెను పోలీసులు కార్యాలయం నుంచి బయటకు పంపించారు.

మువ్వన్నెల రెపరెపలు

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణతంత్ర దినోత్సవం
- జాతీయ జెండాలు ఎగురవేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

భువనగిరి ప్రభుత్వ జూనియర్ మైదానంలో గణతంత్ర వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శనలు

76వ గణతంత్ర దినోత్సవాలు ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాతీయ జెండా ఎగుర వేశారు. స్వీట్లు పంచారు. పలు పాఠశాలల విద్యార్థులు జాతీయ పతకాలతో ర్యాలీ తీశారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లోని పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్లు ఇలా త్రిపాఠి, తేజస్ నందలాల్ పవార్ జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమర యోధులను సన్మానించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో స్టాళ్లను ప్రదర్శించారు. పరేడ్ గ్రౌండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

జిల్లాను అగ్రగ్రామిగా నిలుపుదాం..

- కలిసికట్టుగా పనిచేసి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదాం
- జిల్లాలో 553. 82 కోట్ల రుణాల మాఫీ
- మహాలక్ష్మి కింద 4.54లక్షల సిలిండర్లకు సబ్సిడీ
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి ప్రభుత్వ జూనియర్ మైదానంలో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదాద్రి భువనగిరి, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని కలెక్టర్ హనుమంతరావు ఆకాంక్షించారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మన జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదామని చెప్పారు. ఆ దిశలో అందరం అంకితమై శ్రమిద్దామన్నారు. భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ దేశమంతా ఆనందోత్సాహాలతో గణతంత్ర దినోత్సవాన్ని పండుగలా జరుపుకొనే పర్వదినం అని అన్నారు. ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశంగా భారత్‌ను నిలుపుకొనేందుకు భారతరత్న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున రిపబ్లిక్ డే వేడుకలు జరుపుకోవడం సంతోషమన్నారు. మన జిల్లాలో ఇప్పటివరకు ఆర్టీసీ బస్సులలో 1. 04 కోట్ల మహిళా ప్రయాణికులకు 53 కోట్ల 5 లక్షల రూపాయలతో ఉచిత ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. మహా లక్ష్మి పథకం కింద 4 లక్షల 54 వేల 299 సిలిండర్లను అందజేసి, 13 కోట్ల 96 లక్ష రూపాయలను వారి ఖాతాల్లో సబ్సిడీని జమ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకి 3 దఫాలుగా పంట రుణాలు తీసుకున్న 68 వేల 584 మంది రైతులకు 553 కోట్ల 82 లక్షలను మాఫీ చేసినట్టు చెప్పారు. రైతు భరోసా పథకం కోసం ప్రతి గ్రామంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ ద్వారా సాగుకు యోగ్యమైన భూములను గుర్తించి రైతు భరోసా పోర్టల్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. అనంతరం వివిధ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, అడిషనల్ కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, ఏసీపీ రాహుల్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దళిత సంఘం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

అంబేద్కర్‌ను అగౌరపర్చిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

- భువనగిరి క్యాంపు కార్యాలయం ఎదుట దళిత సంఘాల ఆందోళన
- అరెస్ట్ చేసిన పోలీసులు.. పలువురికి గాయాలు

భువనగిరి అర్బన్, జనవరి 26 : భువనగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం లేకుండా, జాతీయ పతాకాన్ని సరైన విధంగా ఏర్పాటు చేయకుండా (ఒకే పక్కతాడు కట్టి కిందకు పడిపోయే విధంగా ఉన్న) ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి అగౌరవ పర్చారని బీఆర్ఎస్, బీజేపీకి చెందిన దళిత నాయకులు, దళిత సంఘాల నాయకులు క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ భువనగిరి మండలాధ్యక్షుడు జనగాం పాండు, మాజీ కౌన్సిలర్ రత్నపురం బలరాం మాట్లాడుతూ దళితులను కించపరిచే విధంగా ఎమ్మెల్యే అంబేద్కర్ చిత్ర పటం ఏర్పాటు చేయలేదని, అంబేద్కర్‌ను, జాతీయ పతాకాన్ని అగౌరవపర్చిన ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న పోలీసులు ధర్నాను విరమింపజేయడంతో దళిత నాయకులకు పోలీసులకు తోపులాట జరిగింది. దళిత నాయకుడు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, మాజీ కౌన్సిలర్ రత్నపురం బలరాంతోపాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పలువురికి రక్తం వచ్చే విధంగా పోలీసులు కొట్టారు. ఈ క్రమంలో అరెస్టు చేసిన దళిత నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు.